క్రైస్తవుల సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



చర్చి నూతన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తదితరులు

రాంనగర్/అంబర్‌పేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమాన్ని విస్మరించిందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో క్రైస్తవుల అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశామని అన్నారు. మంగళవారం అంబర్‌పేట డివిజన్‌లోని ఒవైసీ నగర్‌లో సెయింట్ ఫ్రాన్సిస్ సావియర్ క్యాథలిక్ చర్చి నూతన భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబర్‌పేట నియోజకవర్గంలోని క్రైస్తవుల సంక్షేమానికి, చర్చి నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తామని అన్నారు. భవిష్యత్ అవసరాలు, ప్రత్యేక ప్రార్థనల కోసం పాత చర్చిని కూలగొట్టి నూతన భవనం నిర్మించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, క్రైస్తవ సంఘం ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడు రాజేందర్, సభ్యులు దాసు, సోను, విజయ్, రాజారావు, బీఆర్‌ఎస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, మహేష్ ముదిరాజ్, సంతోష్‌చారి, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



రాజన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బండారు దత్తాత్రేయ తదితరులు

బీజేపీ నేతకు దత్తాత్రేయ పరామర్శ

చిక్కడపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నేత, చిక్కడపల్లి మాజీ ప్రధాన కార్యదర్శి బి.రామకృష్ణను హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మంగళవారం పరామర్శించారు. రామకృష్ణ తండ్రి అయిన బి.రాజన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అగ్రికల్చరల్ విభాగం డైరెక్టర్‌గా పనిచేశారు. అయితే, ఇటీవల రాజన్న మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని దత్తాత్రేయ పరామర్శించారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ రాజన్న డైరెక్టర్‌గా ఉన్న సమయంలో పలు అంశాల్లో ఆయన వద్ద సలహాలు తీసుకునేవాడినని వివరించారు. ఈ సందర్భంగా రాజన్న చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు జైపాల్‌రెడ్డి, కూరగాయల శ్రీను, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే శాంతి భద్రతల పరిరక్షణ

● డీసీపీ శిల్పవల్లి



శంకర్‌గౌడ్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేసిన సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి

ముషీరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే శాంతి భద్రతల పరిరక్షణ సాధ్యమవుతుందని సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి అన్నారు. మంగళవారం భోలక్‌పూర్ బీఆర్‌ఎస్ డివిజన్ ఉపాధ్యక్షుడు పీస్ కమిటీ సభ్యుడు ఏ.శంకర్‌గౌడ్ ఇటీవల జరిగిన పండుగలు, ఉత్సవాలు, ర్యాలీలలో బాధ్యతాయుతంగా వ్యవహరించినందుకు అభినందిస్తూ ఆయనకు డీసీపీ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పీస్ కమిటీ సభ్యులు సామాజిక బాధ్యతతో పోలీసులకు ఎంతో సహకరిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవాలు కొనసాగేలా కృషిచేస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో పోలీసులకు తమ వంతు సహకారం అందించాలని డీసీపీ కోరారు.



అశోక్‌నగర్ ఎస్‌బీహెచ్ కాలనీలో విద్యుత్ సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్, విద్యుత్ అధికారులు

అశోక్‌నగర్‌లో సమస్యలను పరిష్కరిస్తా

చిక్కడపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్ ఎస్‌బీహెచ్ కాలనీ వాసుల సమస్యలతో పాటు పరిసర ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరిస్తానని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్ కుమార్ తెలిపారు. కాలనీలో తరచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు కార్పొరేటర్ పావనివినయ్ కుమార్‌కు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఆమె సీబీడీ(సెంట్రల్ బ్రేక్ డౌన్) ఏఈ వినోద్, అశోక్‌నగర్ ఏఈ గోపాలకృష్ణలతో కలిసి కాలనీలో పర్యటించారు. విద్యుత్ సమస్యను పరిశీలించారు. కాలనీలో ఏర్పాటు చేసిన ఆర్ఎంయూ బాక్స్‌లో ఏర్పడ్డ సాంకేతిక లోపం వల్ల విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలుసుకుని అడిషనల్ డివిజనల్ ఇంజనీర్ నెహ్రూనాయక్‌తో ఫోన్‌లో మాట్లాడారు. మూడురోజుల్లో సమస్య పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్, నాయకులు శివకుమార్, సాయికుమార్, రఘుయాదవ్, అభిషేక్, సంయుక్తరాణి, కాలనీవాసులు నాగరాజు, హన్స్‌రాజ్, విఠల్‌రావు, వెంకటేశం, శ్యామ్, సుందర్, రమణ, సురేష్, సంగీత తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్ హోమ్‌కు నలుగురు బాలురు

● రైల్వే పోలీసుల అదుపులో మైనర్లను తరలిస్తున్న నిందితులు

బర్కత్‌పుర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మైనర్లను కంపెనీలలో పనులకు తరలిస్తున్న నలుగురిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు మంగళవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించగా కర్ణాటక సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో తీసుకెళ్తున్న నలుగురు బాలురను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నలుగురు బాలురను పనులకు తరలిస్తున్న యూపీకి చెందిన రాఘవేంద్ర (20), రాజస్థాన్‌కు చెందిన రాజ్‌కుమార్ (31), మధ్యప్రదేశ్‌కు చెందిన దీపక్ శేరేనా (28), అదే రాష్ట్రానికి చెందిన అంకోష్ (20)లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. నలుగురు బాలురలను చైల్డ్ హోమ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.



నవీన్‌పట్నాయక్‌ను సత్కరిస్తున్న నిరుద్యోగులు

నిరుద్యోగ జేఏసీ నేతకు సత్కారం

చిక్కడపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీలో పోటీపరీక్షలకు సిద్ధమవుతూ నిరుద్యోగ సమస్యలపై నిరంతరం పోరాడుతున్న నిరుద్యోగ జేఏసీ నేత నవీన్‌పట్నాయక్‌ను తోటి నిరుద్యోగులు మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ నేతలు శంకర్‌నాయక్, కయ్య వెంకటేష్, బాలకోటి మాట్లాడుతూ నవీన్‌పట్నాయక్ పోటీపరీక్షలకు సిద్ధమవుతూనే ఇటీవల నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన కాంగ్రెస్ నిరుద్యోగ బాకీ కార్డు ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతం కావడంలో నవీన్ ఎంతో కృషి చేశారని అన్నారు. ప్రభుత్వం జాబ్‌నోటిఫికేషన్‌లు విడుదల చేసేవరకు ఉద్యమం ఆగదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగులు సంపత్, గణేష్, మధు, రమేష్‌కుమార్, అస్మా, శంకర్, శింబు, నరేష్, శాంతి, రవి, శ్రీనివాస్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న 2003-04 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

గోల్నాక, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్ మారుతీనగర్‌లోని నాలెడ్జ్ హైస్కూల్‌కు చెందిన 2003-04 బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనాన్ని మంగళవారం స్కూల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. రెండు దశాబ్దాల తరువాత కలుసుకున్న స్నేహితులు గత అనుభూతులను నెమరువేసుకుని, సంతోషాలను పంచుకున్నారు. 21ఏళ్ల తరువాత కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఇక నుంచి ప్రతియేటా ఆత్మీయ సమ్మేళనం జరుపుకుని అందరం కలుసుకుందామని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు జోషి, పరమేష్, రఘువరన్, శ్రీనివాస్, కనకరాజు, సురేఖ, సంతోషి లతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఐ, డీప్‌ఫేక్‌తో జాగ్రత్త : సీపీ సజ్జనార్



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానమైన కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను మంచితో పాటు చెడుగా ఉపయోగించేందుకు కొందరు నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నారని, దీనిపట్ల ప్రజలు చాలా జాగ్రత్తగా, అప్రమత్తంగా వ్యవహరించాలని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీ.సీ.సజ్జనార్ సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఏఐ, డీప్‌ఫేక్ వంటి టెక్నాలజీలతో ఒక వ్యక్తి ముఖం, స్వరాన్ని అత్యంత ఖచ్చితమైన పోలికలతో రూపొందించి వాడుకుంటున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో మోసగాళ్లు తమ స్నేహితులమని, సహోద్యోగులమని, ఉన్నతాధికారులమని, నమ్మకం కలిగిన వ్యక్తుల వలే నటిస్తూ మోసం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి వాటి పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సజ్జనార్ సూచించారు. తమను తాము రక్షించుకునేందుకు ఎదుటి వారు నిజమైన వారో కాదో నిర్ధారించుకోవాలని ప్రజలకు ఆయన సూచించారు. తాము ముందుగానే నిర్ణయించుకున్న సురక్షితమైన పదాన్ని కుటుంబ సభ్యులు, సన్నిహితులతో సెట్ చేసుకోవడం ద్వారా సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండేందుకు అవకాశం ఉందని ఆయన ట్వీట్ చేశారు.



ఛట్ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీధర్‌చారి, ముచ్చకుర్తి ప్రభాకర్

జన్‌సేవా సంఘం ఆధ్వర్యంలో ఛట్ పూజ

● పాల్గొన్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జన్‌సేవా సంఘం ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్డులో నిర్వహించిన ఛట్ పూజా కార్యక్రమానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సూర్యభగవానునికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్‌చారి, ఎయిర్‌టెల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహాన్నిచ్చేవి పురస్కారాలు

● మధుసూదనాచారి

చిక్కడపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రోత్సాహాన్నిచ్చేవి పురస్కారాలు అని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. సాహిత్య రత్న చిక్కారామదాసు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభాపురస్కారాల ప్రదానసభ మంగళవారం త్యాగరాయ గానసభలో జరిగింది. మధుసూదనాచారి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అతిథులుగా పాల్గొని పురస్కారాలను బహూకరించారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ యువతను పురస్కారాలతో సత్కరించి వారు సమాజానికి తమ రంగాల ద్వారా మరింత సేవ చేయడానికి ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. ఫౌండేషన్ నిర్వాహకులు చిక్కా రవికిరణ్, నరేందర్, దేవదాసు, శంకర్, శ్రీనివాస్‌లు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కాగా, అశోక్‌కుమార్‌హిరావత్, కె.శ్రీనివాసరావు, డేవిడ్‌రాజుతో పాటు పలువురు గాయనీగాయకులు, రచయితలు తదితరులను పురస్కారాలతో సత్కరించారు. సినీ సంగీత విభావరి జరిగింది.

'వెంటనే చికిత్స చేస్తే పక్షవాతం శాశ్వతం కాదు'

ముషీరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బ్రేయిన్ స్ట్రోక్ వచ్చిన వెంటనే 4గంటల్లో ఆస్పత్రికి తీసుకెళ్లితే ప్రాణాలు కాపాడుకోవచ్చని, శాశ్వత వైకల్యాన్ని నివారించవచ్చని ముసీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి, ముషీరాబాద్ గురునానక్ కేర్ ఆస్పత్రి న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. ప్రపంచ స్ట్రోక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం డాక్టర్లు వేరు వేరుగా ప్రకటనలు విడదల చేశారు. స్ట్రోక్‌పై ప్రజలలో అవగాహన కల్పించడం, నివారణ చర్యలను ప్రోత్సహించడం, సకాలంలో గుర్తించి చికిత్స పొందేలా దృష్టిసారించేందుకు ప్రతి సంవత్సరమూ అక్టోబరు 28న స్ట్రోక్ దినోత్సవాన్ని పాటిస్తారని తెలిపారు. స్ట్రోక్ వచ్చినప్పుడు ప్రతి నిమిషం ఎంతో విలువైందని పక్షపాతం లక్షణాలను వెంటనే గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలి వారు సూచించారు. ప్రతి లక్ష మందిలో గ్రామాలలో 262మందికి, పట్టణాలలో 424మందికి స్ట్రోక్ వస్తున్నదని వివరించారు. ఆకస్మిక అవయవాల బలహీనత, ముఖం వలిపోవడం, మాట్లాడడంలో ఇబ్బంది. వాంతులు, ఆకస్మిక స్పృహకోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్లను సంప్రదించాలని వారు సూచించారు.

గోమాతను రాష్ట్ర మాతగా ఆమోదించాలి

● బీవైఎస్‌ఎస్ నేతల ర్యాలీ



ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న భారత యువ సేవా సంఘ్ ప్రతినిధులు

చిక్కడపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గోమాతను రాష్ట్ర మాతగా భారత ప్రభుత్వం ఆమోదించాలని భాతర యువ సేవా సంఘ్(బీవైఎస్‌ఎస్) ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో బీవైఎస్‌ఎస్ ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. గోమాతను రాష్ట్ర మాతగా ప్రకటించాలని కోరుతూ నినాదాలు చేశారు. అనంతరం జవహర్‌నగర్‌మీదుగా చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీవైఎస్‌ఎస్ జాతీయ యూత్ అధ్యక్షుడు మద్దిశెట్టి సామెలు, సౌతిండియా ప్రధానకార్యదర్శి ప్రశాంత్‌జీ మాట్లాడుతూ గోమాతలో అందరు దేవతలు, దేవుళ్ళు ఉన్నారని, గోమాతను రాష్ట్ర మాతగా భారత ప్రభుత్వం ఆమోదించాలని కోరారు. గోమాతను పూజిస్తే సర్వదేవతలను పూజించినట్లేనని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ, వివిధ రాష్ట్రాల నాయకులు, ప్రతినిధులు షేక్ షావలి, శివాజీ పాణిగ్రాహి, గౌరవ్‌సర్కార్, మధుయాదవ్, రవిచంద్రారెడ్డి, శ్రవణ్‌కుమార్, శ్రీనివాస్‌రాజ్, ప్రణవ్‌యాదవ్, ఆర్యన్, మన్సూర్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

భవానీ శంకర ఆలయంలో కార్తీక శోభ



భవానీ శంకర ఆలయంలో శివలింగ ఆకారంలో దీపాలు వెలిగించిన భక్తులు

ముషీరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కార్తిక మాసాన్ని పురస్కరించుకొని భోలక్‌పూర్ డివిజన్ దేవుని తోటలోని ప్రసిద్ధిగాంచిన భవానీ శంకర ఆలయంలో శివలింగం ఆకారంలో భక్తులు కార్తిక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆధ్యాత్మిక శోభ వెల్లువిరిసింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మేడి సురేష్ కుమార్ మాట్లాడుతూ... కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నవంబరు 20 వరకు ప్రతిరోజూ స్వామివారికి అర్చనలు, అభిషేకాలు తదితర పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో జ్యోతి, సిబ్బంది సురేష్, సాగర్ పాల్గొన్నారు.

నారాయణశాస్త్రికి సన్మానం



నారాయణశాస్త్రిని సత్కరించిన ఈవో దేనాథం, అర్చకులు లక్ష్మీపతిశర్మ

చిక్కడపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా చిక్కడపల్లి వివేక్ నగర్‌లోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ రిటైర్డ్ సీనియర్ మేనేజర్ భాగి నారాయణ శాస్త్రి కార్తీక మాసం విశిష్టత గురించి భక్తులకు సంగీతం రూపంలో వివరిస్తున్నారు. కార్తీకమాస విశేషం, కార్తీకమాసంలో ఎలా నిష్టగా ఉండాలి, శివున్ని ఎలా ఆరాధించాలి తదితర అంశాలను శ్లోకాలు, పద్యాలతో సహా తాత్పర్యాన్ని వివరిస్తూ భక్తులను ఆకట్టుకుంటున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయనను ఆలయ ఈవో దేవనాథం, ముఖ్య అర్చకులు లక్ష్మీపతిశర్మ సత్కరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యాసంస్థల బంద్‌లో భాగస్వామ్యం కావాలి

● ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శుల పిలుపు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అక్టోబర్ 30న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థలు, ప్రొఫెషనల్ విద్యా సంస్థలు, యూనివర్సిటీల బంద్‌లో యూనివర్సిటీల విద్యార్థులు, ప్రొఫెసర్లు భాగస్వాములు కావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రజనీకాంత్, టి.నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బంద్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఆరేళ్లగా పెండింగ్ ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించకపోవడంతో విద్యార్థుల చదువులు నష్టపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.అశోక్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేందర్, ఓయూ కార్యదర్శి అజయ్ కుమార్, ఉపాధ్యాక్షులు కిరణ్, సహాయ కార్యదర్శి మనోజ్, నాయకులు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మయ్య

గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిని దేశ బహిష్కరణ చేయాలి

● మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు బ్రహ్మయ్య

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిని దేశం నుంచి బహిష్కరించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య, ఆర్ట్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ కొండా నాగేశ్వర్ రావు డిమాండ్ చేశారు. గవాయ్ పైన జరిగిన దాడిని ఖండిస్తూ ఉస్మానియా యూనివర్సిటీలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్), దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని భారత రాజ్యాంగ వ్యవస్థలపై దాడిగా పరిగణిస్తున్నామన్నారు.



సమావేశంలో పాల్గొన్న బత్తిని సుదర్శన్‌గౌడ్ తదితరులు

ఫార్మసీ ఆఫీసర్స్ సమస్యలు పరిష్కరించాలి

నల్లకుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల క్రితం అపాయింట్‌మెంట్ అయిన ఫార్మసీ ఆఫీసర్స్‌కు ప్రొబేషన్ డిక్లరేషన్, సర్వీస్ రెగ్యులరైజేషన్ ఉత్తర్వులు వెంటనే ఇవ్వాలని తెలంగాణ స్టేట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్ కోరారు. ఈ మేరకు మంగళవారం సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ సర్వే సంగీత సత్యనారాయణను కలిసి 104 సర్వీస్‌లో పనిచేస్తున్న ఫార్మసీ ఆఫీసర్స్‌కు నాన్‌నోటిఫైడ్ వెకెన్సీలలో మెర్జ్ చేసి పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. అనంతరం హైదర్‌గూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫార్మసీ ఆఫీసర్స్‌కు అన్ని జోన్‌లలో ఏరైజ్ అయిన వేకెన్సీలలో వెంటనే ప్రమోషన్‌లు కల్పించాలని కోరారు. ఇందుకు స్పందించిన కమిషనర్ ఈ అంశాలపై రాష్ట్ర మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీలతో కలిసి చర్చించి వారం రోజుల్లో ప్రమోషన్ కల్పించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత అడ్‌హక్ ప్రమోషన్స్ కూడా ఇస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, కందకట్ల శరత్‌బాబు, స్టేట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జాలిగామ అశోక్, కోశాధికారి యాదయ్య, నాయకులు ఏ.వి.శ్రీహరి, ఆనంద్‌కుమార్, ప్రకాష్‌రావు, వెంకటరమణ, పుల్లయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఫీల్డ్ అసిస్టెంట్లకు పేస్కేల్ ఇవ్వాలి'

చిక్కడపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు పేస్కేల్ ఇవ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ అధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రజాభవన్ ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికాసంఘం వైస్‌చైర్మన్ జి.చిన్నారెడ్డిని ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ నేతలు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగభద్రత కల్పించాలని, వేతనాలను రూ.26వేలకు తగ్గకుండా చూడాలని, సర్క్యులర్ నెంబర్ 4,779ను ఉపసంహరించాలని, పనిభారం తగ్గించాలని, కార్మిక చట్టం ప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ, సెలవులు, ప్రమాద బీమా తదితర సౌకర్యాలు అమలు చేయాలని ఆయన కోరారు.

● ఆలయ సిబ్బందికి దుస్తులు పంపిణీ



అంబర్‌పేట మహంకాళి ఆలయం అర్చకులు, సిబ్బందికి వీహెచ్‌ఆర్ సేవా సదన్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు మంగళవారం దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌ఆర్ సేవా సదన్ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ పుల్లా నారాయణస్వామి, ఆలయ కమిటీ సభ్యులు గడ్డం శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- రాంనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి)

● పవర్ బోరింగ్‌లకు రిపేర్ చేయాలి



రాంనగర్ డివిజన్‌లో చెడిపోయిన పవర్ బోరింగ్‌లను రిపేర్ చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతూ జలమండలి నారాయణగూడ డివిజన్ జనరల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డికి బీజేవైఎం ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ గడ్డం నవీన్ మంగళవారం వినతిపత్రం సమర్పించారు. వెంటనే చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని నవీన్ పేర్కొన్నారు. ఇందుకు స్పందించిన జీఎం తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- రాంనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి)

నేడు గోల్నాకలో బీసీల సమావేశం

గోల్నాక, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గ బీసీల సమావేశాన్ని గోల్నాక డివిజన్ గోవింద్‌నగర్‌లోని అశోకా ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నామని తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు కేపీ మురళీకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బోయపల్లి లింగంగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం జరుగుతున్న పోరాటంలో బీసీలను జాగృతం చేయడానికై తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఇందులో భంగంగానే మొదట అంబర్‌పేట నియోజకవర్గలో సమావేశంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని బీసీలు, వివిధ రాజకీయ పార్టీలలోని నాయకులు, కుల సంఘాల నేతలు భారీగా తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేసి బీసీల ఐక్యతను చాటాలని వారు కోరారు.

చెట్ల కొమ్మల తొలగింపు

● పనులను పరిశీలించిన కార్పొరేటర్ ఉమాదేవి

బర్కత్‌పుర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్ నింబోలిఅడ్డ, రహమత్‌బాగ్‌లో వీధి లైట్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను మంగళవారం జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగించారు. ఈ పనులను స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమాదేవి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రవియాదవ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.